ప్యాచ్.. అంతా తూచ్

'సంక్రాంతి నాటికి అద్దాల్లాంటి రోడ్లు నిర్మిస్తాం. ఈ దఫా సంక్రాంతి పండుగకు బయటి ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు వచ్చేవాళ్లు ఇక్కడున్న రోడ్లను చూసి ఆశ్చర్యపోయేలా చేస్తాం' ఇది సీఎం చంద్రబాబు చెప్పిన మాట. కానీ అవన్నీ క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోలేదు. రాప్తాడు నియోజకవర్గంలో దాదాపుగా 1,500 కి.మీ తారు రోడ్లు ఉండగా వాటిలో 70 శాతం రోడ్లు వర్షాలకు దెబ్బతిన్నాయి. కానీ కూటమి ప్రభుత్వం ఇక్కడ 60 శాతం మేర రోడ్ల మరమ్మతులు చేసినట్లు చెబుతున్నా.. వాటిని కూడా నాసిరకంగా వేశారు. పండుగకు ఇక్కడికి వచ్చిన వాళ్లు రోడ్లను ప్రత్యక్షంగా చూసి అసహనం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చలేదని మండిపడుతున్నారు.


అనంతపురం నగరానికి కూతవేటు దూరంలో అధ్వానంగా ఉన్న అయ్యవారిపల్లి రోడ్డు


రామగిరి మండలంలో పీఆర్ కొట్టాల నుంచి ఎగువపల్లికి వెళ్లే రోడ్డు దుస్థితి

- సంక్రాంతి హామీ హుళక్కే
- తూతూమంత్రంగా ప్యాచ్‌వర్క్‌లు
- 80 శాతం రోడ్లల్లో గుంతలు
- ప్రజలకు తప్పని అవస్థలు
- ఇదీ రాప్తాడు నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి

రాప్తాడు: నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి ఘోరంగా తయారైంది. రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో రోడ్లకు ప్యాచ్‌వర్క్ చేపట్టారు. ఈ పనులు దక్కించుకున్న కూటమి కాంట్రాక్టర్లు సైతం సొమ్ము మిగిలేలా పనులు చేపట్టారు. రాప్తాడు మండలం రామినేపల్లి నుంచి ఎం.బండమీదపల్లి, సాక్షి కార్యాలయం నుంచి కక్కలపల్లి మీదుగా కనగానపల్లి మండల కేంద్రం వరకూ తూతూమంత్రంగా పనులు చేయడంతో మళ్లీ గుంతలు దర్శనమిస్తున్నాయి. రామగిరి మండలంలో ఎగువపల్లి నుంచి కొత్తగ్యాది కుంటకు వెళ్లే రహదారి, గ్యాదికుంట నుంచి కనగానపల్లి మండలంలోని సోమరవాండ్ల పల్లికి వెళ్లే మార్గంలో చేపట్టిన ప్యాచ్‌వర్క్‌లు కూడా అద్వానంగా ఉన్నాయి. ధర్మవరం నుంచి మామిళ్లపల్లి, కనగానపల్లి మీదుగా కళ్యాణదుర్గం వరకూ రోడ్లకు మరమ్మతులు చేయగా.. అప్పుడే గుంతలు ఏర్పడ్డాయి. ఆత్మకూరు నుంచి ముట్టాల వరకు (4 కిలోమీటర్లు), ఆత్మకూరు నుంచి సిద్దాపురం వరకు (3 కిలోమీటర్లు) నాసిరకంగా పనులు చేశారు. ఇక అనంతపురం రూరల్ మండలంలో కూడా చేపట్టిన ప్యాచ్‌వర్క్‌లు అధ్వానంగా ఉన్నాయి. ఈ రోడ్లు మరో నెల కూడా ఉంటాయనే నమ్మకం లేదు. ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనాల్లో వెళ్లే వాహనాదారులు కిందపడి ప్రమాదాలకు గురైన సంఘటనలు కోకోల్లాలు. గొరిదిడ్ల నుంచి వేపచెర్లకు వెళ్లే 5 కిలోమీటర్ల రోడ్డు వర్షాలకు దెబ్బతింది. రామగిరి మండలంలో ఎగువపల్లి నుంచి పీఆర్ కొట్టాలకు వెళ్లే 7 కిలోమీటర్ల రోడ్డు ప్రయాణానికి అనుకూలంగా రోడ్లన్నీ గుంతలమయం లేదు. ఎమ్మెల్యే పరిటాల సునీత సొంత గ్రామమైన వెంకటాపురంకు 5 కిలోమీటర్ల దూరంలోనే ఈ గ్రామం ఉంది. ఎమ్మెల్యే గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలోనే రోడ్డు పరస్థితి ఇలా ఉంటే.. మిగతా గ్రామాల రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అలాగే పీఆర్ కొట్టాల నుంచి గ్యాదికుంట వెళ్లే రోడ్డు ఘోరంగా మారింది. వీటన్నింటిని అసలు పట్టించుకోకుండా రోడ్ల మరమ్మతులు చేశామని కూటమి నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారు. వాస్తవంగా రోడ్ల మరమ్మతులు పూర్తిస్థాయిలో జరగలేదని ప్రజలకే తెలుసు.

రోడ్లన్నీ గుంతలమయం



కూటమి ప్రభుత్వంలో రోడ్లన్నీ గుంతలమయంగా తయారవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక అనంతపురం నుంచి కనగానపల్లి వరకు ప్యాచ్‌వర్క్ చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ గోతులమయం కావడం గమనార్హం. నెల రోజులకే తారు పూర్తిగా తొలగిపోయింది. మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. ఎంతలా నాణ్యత ప్రమాణాలు పాటించారో ప్యాచ్‌వర్క్‌లను చూస్తే అర్థమవుతుంది.

– గవ్వల నల్లప్ప, గాండ్లపర్తి, రాప్తాడు మండలం

వెంటనే బాగు చేయాలి



నియోజకవర్గంలో అనేక ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. మా రామగిరి మండలంలో రోడ్ల గురించి చెప్పాల్సిన పని లేదు. కర్ణాటక రాష్ట్రం ఎగువపల్లి నుంచి పీఆర్ కొట్టాలకు వెళ్లే రహదారి చాలా అధ్వానంగా ఉంది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై గుంతలు ఎక్కువగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సంక్రాంతి నాటికి రోడ్లు వేస్తామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. హామీని నెరవేర్చడంతో చంద్రబాబు విఫలమయ్యారు.

– సంపత్ కుమార్, పీఆర్ కొట్టాల, వైస్ ఎంపీపీ, రామగిరి మండలం

క్లుప్తంగా

జిల్లా క్రికెట్ జట్టు కెప్టెన్‌కు అభినందనలు


గణేష్‌ను అభినందిస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: ఈ నెల 6 నుంచి 12వరకు జరిగిన అండర్–12 క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టుకు టి. గణేష్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. శుక్రవారం ధర్మవరం ఆర్డీటీ స్టేడియంలో గణేష్‌ను ధర్మవరం మండల క్రికెట్ అసోషియేషన్ అధ్యక్షుడు వడ్డే బాలాజీ, ఆర్డీటీ క్రికెట్ కోచ్ రాజశేఖర్ ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా షీల్డ్‌తో సత్కరించారు. భవిష్యత్‌లో మంచి క్రీడాకారుడిగా గుర్తింపు తెచ్చుకోవాలని వారు సూచించారు.

హోమియో డాక్టర్‌గా జ్యోతి అర్చన


డాక్టర్ జ్యోతి అర్చనకు పూల మొక్క అందిస్తున్న సిబ్బంది

పుట్టపర్తి టౌన్: స్థానిక హోమియో వైద్యశాలలో డాక్టర్ జ్యోతి అర్చన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ కృష్ణయ్య ఉద్యోగ విరమణ చేశారు. దీంతో గుంతకల్లులో పని చేస్తున్న డాక్టర్ జ్యోతి అర్చన ఇక్కడికి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా సిబ్బంది ఆమెకు స్వాగతం పలికి పూల మొక్క అందజేశారు. అనంతరం రిటైర్డ్ డాక్టర్ కృష్ణయ్యను సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది రవికుమార్, శ్రీకాంత్, షామీర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ వెల్ఫేర్ డీడీని సస్పెండ్ చేయాలి

ధర్మవరం రూరల్: అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ నిర్మలజ్యోతిని సస్పెండ్ చేయాలని పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, ఏఐఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపిరెడ్డిపల్లి పృథ్వీ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పరిధిలోని సంక్షేమ వసతి గృహాల్లో విధులను నిర్వహిస్తున్న వార్డెన్‌ల నుంచి డీడీ అక్రమంగా వసూళ్లు చేస్తోందన్నారు. అవినీతికి పాల్పడినట్లు పక్కా ఆధారాలు చూపినా జిల్లా మంత్రి సవితమ్మ ఎందుకు స్పందించడం లేదో చెప్పాలన్నారు. ఇప్పటికైనా అవినీతి అధికారిణిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘం నాయకులు నందకిషోర్, మధు, మారుతి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ బి ప్లస్ గ్రేడ్


ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2.57 పాయింట్లతో న్యాక్ బి ప్లస్ గ్రేడ్ సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. స్థానిక కళాశాలలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కళాశాల న్యాక్ బృందం మూల్యాంకనంలో కళాశాల బి ప్లస్ గ్రేడ్ పొందడం ఆనందంగా ఉందన్నారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన అర్హతలు గల అధ్యాపక, అధ్యాపకేతర బృందం ఉండటం గర్వకారణమని తెలిపారు. ఐదేళ్లలో విద్యార్థులకు మంచి ఫలితాలు రావడం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, క్రీడల్లో సాధించిన విజయాలు, అధునాతనమైన కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ లైబ్రరీ, జిమ్, ఆర్ఓ వాటర్ ప్లాంట్, సీసీ కెమెరాలు, మంచి వాతావరణం ఉండడమే న్యాక్ బి ప్లస్ గ్రేడ్ రావడానికి కారణమన్నారు. సమష్టి కృషితోనే గతంలో సి గ్రేడ్‌గా ఉన్న కళాశాలకు బి ప్లస్ గ్రేడ్ వచ్చిందని తెలిపారు.

మొక్కుబడిగా మండల మీట్


మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యమ్మ

కనగానపల్లి: ప్రజా సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించేందుకు ఏర్పాటుచేసిన మండల సర్వసభ్య సమావేశం అధికారులు మొక్కుబడిగానే నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు పలుశాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఇక సమావేశానికి వచ్చిన అధికారులు కూడా కొందరు మధ్యలోనే బయటకు వెళ్లిపోయారు. దీంతో సమావేశంలో పాల్గొన్న అధికారులు తూతూమంత్రంగా ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ భాగ్యమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు బాధ్యతగా పనిచేస్తూ ప్రజాప్రతినిధులకు సరైన గౌరవాన్ని ఇవ్వాలన్నారు. తహసీల్దార్ జీ.వీ.ప్రసాద్, ఎంపీడీఓ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశ్రుభంగా ఉంచుకోవాలి


కుళాయి వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న ఆరోగ్య సిబ్బంది

గాండ్లపెంట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ ఉపేంద్రారెడ్డి ప్రజలకు సూచించారు. రెక్కమాను గ్రామంలో శుక్రవారం డ్రై డేపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపునీరు, మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. నీటి నిల్వ వల్ల దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. గ్రామంలోని వీధుల్లో పంచాయతీ కుళాయిల వద్ద నీరు నిల్వ ఉండటంతో వేస్ట్ అయిల్, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఏఎన్ఎం సునిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


రాధమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బత్తలపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గంటాపురం గ్రామానికి చెందిన దారపనేని రాజప్ప, ఓబులమ్మ దంపతుల కుమార్తె దారపనేని రాధమ్మ ప్రకృతి వ్యవసాయంలో డివిజనల్ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తూ భోగి పండుగ రోజున ధర్మవరం నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా గొట్లూరు సమీపంలో బైక్‌పై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను ఆర్డీటీ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి బెంగుళూరుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందింది. ప్రకృతి వ్యవసాయం అధికారులు చైతన్య, రవీంద్ర, భానుమతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్‌కుమార్, నాయకులు జాంపుల చంద్ర మోహన్, పాల్యం అప్పస్వామి, సాకే సురేష్, మినమలూరి లోకేష్ తదితరులు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ వరప్రసాద్, సీఐ శివరాముడు

ముదిగుబ్బ: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని కదిరి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, ముదిగుబ్బ సీఐ శివరాముడు వాహనదారులకు సూచించారు. శుక్రవారం ముదిగుబ్బలో జాతీయ భద్రత మాసోత్సవంలో భాగంగా వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వాహనదారులు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపకూడదన్నారు. వాహన రికార్డులను తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు.

కదిరి టౌన్: డ్రైవర్లు తప్పని సరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని రవాణా శాఖ అధికారి రాజేష్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని వేమారెడ్డి సర్కిల్ వద్ద రోడ్డు నియమాలపై వాహనాదారులు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాం నిర్వహించారు. రవాణా శాఖ సిబ్బంది రోడ్డు నియమాలు తెలిపే కరపత్రాలు డ్రైవర్లకు పంపిణీ చేశారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

ధర్మవరం అర్బన్: స్థానిక మార్కెట్‌వీధిలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో శుక్రవారం బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ప్రమాద బీమా చెక్కును అందించారు. ట్లూరుకు చెందిన రామంజినేయులు భార్య రత్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. రత్న స్టేట్ బ్యాంకులో ప్రమాద బీమా చెల్లించినందున మృతురాలి భర్త రామాంజనేయులుకు రూ.20 లక్షల చెక్కును అందించామని బ్యాంకు ఆర్ఎం శేఖర్, చీఫ్ మేనేజర్లు సందీప్, వైవీఆర్‌నాయుడు తెలిపారు.

ధర్మవరం డీఎస్పీగా హేమంత్‌కుమార్

ధర్మవరం: ధర్మవరం నూతన డీఎస్పీగా బలగ హేమంత్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమల రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ డీఎస్పీగా పని చేస్తున్న శ్రీనివాసులు బదిలీపై ఎక్కడికి వెళ్తారన్నది తెలియాల్సి ఉంది.

కుష్టుపై అవగాహన కల్పించండి


ధర్మవరంలో మాట్లాడుతున్న జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ తిప్పయ్య

కదిరి టౌన్: కుష్టు వ్యాధిపై అపోహలు వీడేలా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ టీబీ ఆఫీసర్ డాక్టర్ జి.తిప్పయ్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నాగేంద్రనాయక్ ఆధ్వర్యంలో ఎన్జీఓ సమావేశం భవనంలో వైద్య సిబ్బందికి సమావేశం నిర్వహించారు. డాక్టర్ జి.తిప్పయ్య మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2 వరకూవైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రతి ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టాలన్నారు. ప్రతి పీహెచ్‌సీ పరిధిలో కచ్చితంగా సర్వే చేసి కుష్టు రోగులను గుర్తించి వారికి మందులు అందజేయాలన్నారు. డీపీఎంలు కుమార్ రెడ్డి, వెంకటరమణ, వైద్యులు, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో శుక్రవారం ధర్మవరం డివిజన్‌లోని మెడికల్ ఆఫీసర్లు, లెప్రసీ నోడల్ ఆఫీసర్లకు కుష్టు నిర్మూలనపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ జి.తిప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సెల్వియాసాల్మన్ మాట్లాడుతూ శరీరంపై స్పర్శలేని రాగి రంగు గల మచ్చలున్నా, అలాగే చేతులు, కాళ్లలో బలహీనత ఉన్నా, చెవిపై బుడిపెలున్నా కుష్టుగా అనుమానించాల్సి ఉంటుందన్నారు. ఆశా వర్కర్లకు వారికి కేటాయించిన గృహాలను సందర్శించి ఇంటిలో గల ప్రతి వ్యక్తిని పరీక్షించాలన్నారు. డీపీఎంలు రమణ, కుమార్‌రెడ్డి, పీపీఎం కోఆర్డినేటర్లు నాగేంద్ర, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి


మక్బూల్‌కు బొకే అందిస్తున్న జిల్లా కార్యదర్శి నాగరాజు

కదిరి: వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం కృషి చేయాలని ఆ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బి.ఎస్.మక్బూల్ అహ్మద్ పేర్కొన్నారు. ఇటీవల పార్టీ జిల్లా కార్యదర్శిగా ఎంపికైన నాగరాజు శుక్రవారం సమన్వయకర్తను ఆయన స్వగృహంలో కలిసి బొకే అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని నాగరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మక్బూల్ మాట్లాడుతూ కదిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీకి కంచుకోట అని, ప్రతి ఒక్కరూ కలిసి పని చేస్తే గెలుపు తథ్యమన్నారు. అధికార పార్టీ నాయకులు తమ పార్టీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తను గుర్తుంచుకుంటానని తెలియజేశారు.

ఎన్పీకుంట: వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీగా నియమితులైన వెలిచలమల ఆంజన్ రెడ్డి శుక్రవారం కదిరిలో నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్‌అహ్మద్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి నాయకుడు, కార్యకర్తను జగనన్న గుర్తించి సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. అనంతరం అంజన్‌రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి


తలుపులలో రాయల విగ్రహం వద్ద జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

అమడగూరు: మండల కేంద్రంలోని చౌడేశ్వరీ కల్యాణమండపం వద్ద శుక్రవారం బలిజ కులస్తుల ఆధ్వర్యంలో శ్రీ కృష్ణదేవరాయల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాయల జీవిత విశేషాలను తెలియజేశారు. ఆయన పాలనలో చెరువులను తవ్వించడంతోపాటు ఆలయాలను నిర్మించారన్నారు. అందరూ ఆయన బాటలోనే నడిచి మంచి సమాజ ఏర్పాటుకు కృషి చేద్దామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం మండలాధ్యక్షుడు గోపాల్, నక్కలచిన్నప్ప, జయప్ప, మేకల శ్రీనివాసులు, సురేంద్ర, సుధాకర్, లక్ష్మీనారాయణ, శ్రీరాములు, రామలింగప్ప, తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక పోలీస్ స్టేషన్ ముందు గల శ్రీ కృష్ణదేవరాయల విగ్రహం వద్ద శుక్రవారం బలిజ సంఘం నాయకులు రాయల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు రాయల కాలంలో చేపట్టిన పనులు, చూపిన మార్గాలను కొనియాడారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. బలిజ సంఘం నాయకులు ఎద్దుల గోపాల్, ఎద్దులరాముడు, ఎం.శంకర, వెంకటరమణప్ప, సత్యమ్మ, ఏ. జయ, రాధాకృష్ణ, రామాంజులు, జయచంద్ర పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బైక్ అపహరణ

ధర్మవరం: రోడ్డు పక్క ఉంచిన బైక్‌ను అపహరించిన ఘటన పట్టణంలోని సాయినగర్ సమీపంలోని ధర్మవరం–పుట్టపర్తి ప్రధాన రహదారి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన మల్లికార్జున సాయినగర్ సమీపంలో ఉన్న ఓ గ్రానైట్ షాపు పక్కన తన ద్విచక్ర వాహనాన్ని ఉంచాడు. అయితే బైక్‌కు తాళం వేయక పోవడాన్ని గమనించిన ఓ దుండగుడు వాహనాన్ని అపహరించుకెళ్లాడు. బాధితుడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చోరీ ఘటన మొత్తం సీసీ కెమెరాలో రికార్డు కావడంతో పుటేజీని తీసుకున్న పోలీసులు దొంగ కోసం గాలింపు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

నల్లచెరువు: చిన్నపల్లోల్లపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు కూలీలు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. వ్యవసాయ కూలీలను పొలం పనులకు తీసుకెళ్లేందుకు శుక్రవారం రైతు చిన్నపల్లోలపల్లిలోని కూలీలకు ట్రాక్టర్ ఏర్పాటు చేశారు. అయితే కూలీలు పనులకు బయలు దేరేందుకు కూలీలు జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్ ఎక్కుతుండగా మదనపల్లి వైపు నుంచి వచ్చిన కారు ఢీ కొంది ఈ ప్రమాదంలో ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు కాగా.. కూలీలు వెంకటమ్మ, వెంకట లక్ష్మి, కళావతి, సి. వెంకటమ్మ అనే కూలీలు గాయపడ్డారు. స్థానికులు వారిని 108లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల దృష్టి

కదిరి టౌన్: కదిరి ప్రాంతంలో అక్రమ మద్యం, గంజాయితోపాటు అసాంఘీక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం సాయంత్రం సీఐ వి.నారాయణరెడ్డి ఎస్ఐ బాబ్జాన్ రెండు బృందాలుగా ఏర్పడి పట్టణంలోని లాడ్జీలు, టీ కేఫ్‌లు, పాత గంజాయి నేరస్తుల ఇళ్లు, స్కూళ్లు, కాలేజ్ గ్రౌండ్స్, రైల్వే స్టేషన్, బస్టాండ్ పరిసరాలను పరిశీలించారు. ఓపెన్ డ్రింక్ చేస్తున్న కొంతమందిని పట్టుకుని కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆలయ పునరుద్ధరణకు విరాళం


నగదు అందిస్తున్న దృశ్యం

తాడిమర్రి: నిడిగల్లు గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునరుద్ధరణకు గ్రామ సర్పంచ్, ఉమ్మడి అనంతపురం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల వెంగమనాయుడు శనివారం రూ.లక్ష విరాళం అందించారు. ఈ నగదు మొత్తాన్ని తన తండ్రి గోనుగుంట్ల వెంకటనాయుడు చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో కాకర్ల చంద్రశేఖర్, ఆదెన్న, వరప్రసాద్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

అమడగూరు: మండల కేంద్రంలో కదిరి ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను శుక్రవారం ఎస్ఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో తొలగింపజేశారు. అమడగూరు నుంచి గాజులపల్లి వరకూ రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు, ఇతర మొక్కలు ఏపుగా పెరిగి ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండేవారు. విషయాన్ని గుర్తించిన ఎస్ఐ జేసీబీతో అడ్డుగా ఉన్న చెట్లు, పిచ్చి మొక్కలను తొలగింపజేశారు.

ఇస్తెమా ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

తాడిమర్రి: మండల కేంద్రంలో ఈనెల 19, 20 తేదీల్లో ముస్లింలు నిర్వహించనున్న ఇస్తెమా ఏర్పాట్లను శుక్రవారం డీఎస్పీ శ్రీనివాసులు పరిశీలించారు. తాడిమర్రి తూర్పు చెరువు సమీపంలో ముస్లింలు ఇస్తెమా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఏర్పాట్లపై నిర్వాహకులతో అడిగి తెలుసుకున్నారు. ధర్మవరం, కదిరి నియోజక వర్గాలతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాల్లోని మత పెద్దలు, ముస్లిం సోదరులు భారీ సంఖ్యలో రానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామని సీఐ పేర్కొన్నారు. ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామ్‌రావు, ఎస్ఐ కృష్ణవేణి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికడదాం


మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటసన్యాసి శర్మ

కదిరి అర్బన్: బాల్య వివాహాలు అరికట్టడం అందరి బాధ్యత అని ఆర్డీఓ వీవీఎస్ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో బాల్య వివాహాలపై కదిరి డివిజన్‌లోని అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఎస్ఐలు, సీడీపీఓలు, ఎన్జీఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టం 2006పై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మండల స్థాయి, గ్రామస్థాయి సమావేశాలు నిర్వహించి ప్రజల్లో చైతన్య తీసుకురావాలన్నారు. బాల్య వివాహాలు నిరోధించడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సమష్టి కృషితోనే వాటిని అరికట్టగలమన్నారు.

భూముల రీ సర్వేపై అవగాహన


మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటసన్యాసి శర్మ, తహశీల్దార్ మురళీకృష్ణ

కదిరి అర్బన్: ఎగువపల్లిలో శుక్రవారం ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ పోలప్పలు భూముల రీ సర్వే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కదిరి మండలానికి సంబంధించి ఎగువపల్లి పంచాయతీని రీ సర్వే పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు ఆర్డీఓ తెలిపారు. రీ సర్వేపై రైతులు తమ సందేహాలను రెవెన్యూ అధికారులతో నివృత్తి చేసుకున్నారు.

కదిరి అర్బన్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అనంత ఫిలిం సొసైటీ వార్షికోత్సవానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆర్డీఓ వీవీఎస్ శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ సమాజానికి మంచి చేసే చిత్రాలను తీయాలని నిర్వాహకులకు సూచించారు. షార్ట్ ఫిలిమ్స్ డైరెక్టర్ రషీద్ మాట్లాడుతూ ఏటా లఘు చిత్రాల హీరోలకు అవార్డు ఇస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా ఫిబ్రవరి 2న ఈ అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. ఈనెల 20వ తేదీ లోపు లఘు చిత్రాలను వాట్సాప్‌లో పంపాలన్నారు.

బీజేపీ నేతపై కేసు నమోదు

కదిరి టౌన్: భూమి పత్రాలు ఫోర్జరీ చేసిన ఘటనలో బీజేపీ నేతతోపాటు మరో ముగ్గురిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన షేక్ నస్రీన్ బేగం భూమి పత్రాలను బీజేపీ నేత గుడిసె దేవానంద్, అతని కుమారుడు గుడిసె సాయి దేవానంద్ ఫోర్జరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పై ఇద్దరితోపాటు సాక్షులు ఇద్దరు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై ఫోర్జరీ, చీటింగ్, బెదిరింపు కేసులు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

నేడు 'స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్'

అమడగూరు: మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ పంచాయతీల్లో శనివారం స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఎంపీడీఓ మునెప్ప శుక్రవారం తెలిపారు. కార్యక్రమ నిర్వహణ కోసం పంచాయతీకి ఒకరు చొప్పున ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.